ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
సోమవారం 19 ఫిబ్రవరి 2024







స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకువస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ దంపతులు

భక్తులకు మంగళసూత్రం చూపుతున్న అర్చకులు



గరుడవాహనంపై స్వామివారు

కల్యాణం.. కమనీయం.

- నేత్రపర్వంగా శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వర, లక్ష్మీనారాయణుల కల్యాణం
- జనసందోహంతో కిక్కిరిసిన మార్కెట్‌రోడ్ వెంకన్న ఆలయం
- గరుడ వాహనంపై శ్రీవారి విహారం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 18: మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి, లక్ష్మీనారాయణ స్వామి కల్యాణాలను ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో తిరుమల నుంచి తెప్పించిన 15 వేల లడ్డూలను భక్తులకు వితరణ చేశారు. అనంతరం అన్నదానం జరిగింది. ఉమ్మడి జిల్లా నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని కనులారా తిలకించి పులకించి పోయారు. భక్తజనంతో కల్యాణ వేదికతోపాటు ఆలయ మాడ వీధులు కిక్కిరిసిపోయాయి. మంత్రి పొన్నం ప్రభాకర్-మంజుల దంపతులు, కుటుంబ సభ్యులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి స్వామి వారల తరఫున ప్రతినిధులుగా వ్యవహరించగా శ్రీదేవి, భూదేవి, లక్ష్మీ అమ్మవార్ల తరఫున కన్యాదాతలుగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈఓ వుడుతల వెంకన్న వ్యవహరించి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ దంపతులు. ఆర్డీవో మహేశ్వర్, ఏసీపీ నరేందర్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ పురుమల్ల శ్రీనివాస్, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కటకం వేంకటరమణ, నార్ల కార్తిక్, పొన్నం అశోక్‌గౌడ్, పొన్నం రవిచంద్ర పాల్గొన్నారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు...

సోమవారం ఉదయం 5 గంటల నుంచి తిరుమల తిరుపతి పండితులతో సుప్రభాతసేవ, అన్నకూటోత్సవం ఉంటుంది. అనంతరం నిత్యహోమం, 9 గంటలకు సింహవాహనసేవ, సాయంత్రం 6 గంటల నుంచి సహస్రదీపాలంకరణసేవ, హనుమత్ వాహన సేవ నిర్వహిస్తారు.

● ఆకట్టుకున్న కల్యాణ ప్రక్రియ...

వేదికపై అర్చకులు నిర్వహించిన కల్యాణ ప్రక్రియ భక్తులను ఆకట్టుకుంది. అమ్మవార్లు, స్వామివారల గుణగణాలు, కల్యాణం గొప్పతనంపై సంభాషణ, వారణమాయిరమ్, పూబంతులాట, మాలా మార్పిడి నృత్యం, వేదమంత్రాలు, వివిధ అలంకరణలు అలరింపజేశాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ కల్యాణం ఆసాంతం జరుగుతున్న వైదిక ప్రక్రియను మంత్రి తిలకించి ఉత్సవంతో మమేకమయ్యారు. మాలామార్పిడి నృత్యం, పూబంతులాట ఆడారు. మంత్రి ప్రత్యేకంగా వేదపండితులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కలెక్టర్ పమేలా సత్పతి తదితరుల గోత్రనామాదులను పఠింప జేశారు. కల్యాణంలో సల్వాజీ ప్రవీణ్ బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు, సాయంత్రం సంగీత కచేరీలు, నృత్యప్రదర్శనలు, పాటలు భక్తి సాగరంలో ఓలలాడించాయి. ఆదివారం రాత్రి ఆలయ మాడ వీధుల్లో జరిగిన గరుడవాహనసేవలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

● టీటీడీ నుంచి పట్టు వస్త్రాలు-ప్రసాదం అందజేత

శ్రీనివాస కల్యాణం సందర్భంగా రాత్రి అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ హోదాలో పేష్కార్ పి శ్రీహరి బృందం టీటీడీ నుంచి పట్టు వస్త్రాలు-ప్రసాదం, మాలలు, పండ్లు, పూలు ఆలయానికి తీసుకొని వచ్చారు. బృందానికి ఆలయ వ్యవస్థాపక వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈఓ ఉడుతల వెన్న స్వాగతం పలికి గర్భాలయంలో శ్రీవారికి సమర్పింపజేశారు. అనంతరం టీటీడీ బృందం శ్రీవారితో పాటు గరుడవాహనసేవలో పాల్గొన్నారు.

● భారీ బందోబస్తు

కల్యాణోత్సవం సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రే ఆలయ మాడ వీధుల వద్ద వాహనాలను అనుమతించలేదు. ఆలయం లోపల ఎక్కడికక్కడ ఇనుప బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. వేదిక వద్ద అర్చకులు, నిర్వాహకులు, సిబ్బంది, నాయకులు, ముఖ్యులను తప్ప ఇతరులను అనుమతించలేదు. ఆలయం చుట్టూ వివిధ మార్గాలు ఏర్పాటు చేసి భోజనాలకు, ప్రసాద స్వీకరణకు పంపించారు. కల్యాణం సమయంలో దర్శనాలు, పూజలు నిలిపి వేశారు. బందోబస్తు ఏర్పాట్లను ఏఊపీ నరేందర్ పర్యవేక్షించారు.

మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో
కలకలం..

- మూడు రోజుల శిశువు అదృశ్యం
- ఘటనపై పలు అనుమానాలు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 18: జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మూడు రోజుల శిశువు ఆదివారం అదృశ్యమైంది. ఈ సంఘటన కలకలం రేపింది. బీహార్ రాష్ట్రం ముజఫర్ జిల్లాకు చెందిన మనోజ్‌రామ్ అనే వలస కార్మికుడు కుటుంబంతో కలిసి కొత్తపల్లి మండలం బావుపేటలో నివాసం ఉంటున్నాడు. అతడి భార్య నిర్మలాదేవిని రెండో కాన్పు కోసం జిల్లా ఆసుపత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 16న చేర్పించారు. అదే రోజు రాత్రి ఆమె పాపకు జన్మనిచ్చింది. నిర్మలాదేవికి ఫిట్స్ రావడంతో ఆమెను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. తల్లి వద్ద శిశువు ఉంటే ఇన్‌ఫెక్షన్ సోకుతుందని పాపను బంధువుల వద్ద ఉంచి, పాలు అవసరం అయినపుడు తాగించి తిరిగి వారికే అందిస్తున్నారు. ఆదివారం మనోజ్‌రామ్ భోజనం తీసుకువచ్చేందుకు వెళ్తూ నిర్మలాదేవి వద్ద శిశువును, తన అన్న కొడుకును (పదేళ్ల బాలుడు) ఉంచి వెళ్లాడు. బయటకు వచ్చిన బాలుడితో ఓ మహిళ మాట్లాడింది. శిశువును ఎత్తుకుంటానని ఆమె చెప్పగా ఆ బాలుడు పసికందును తీసుకొని వచ్చి మహిళకు అప్పగించాడు. ఆమె శిశువును తీసుకుని వెళ్లిపోయింది. మనోజ్‌రామ్ ఆస్పత్రికి వచ్చి చూసేసరికి శిశువు కనిపించలేదు. దీంతో బాలుడిని అడుగగా ఓ మహిళ ఎత్తుకుంటా నంటే ఇచ్చానని చెప్పాడు. ఆందోళన చెందిన మనోజ్‌రామ్ ఆస్పత్రి పరిసరాల్లో వెతికినా కనిపించలేదు. దీంతో అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి విషయం తెలిపాడు. వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆసుపత్రిలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. పసికందును చూసుకునేందుకు ఉంచిన బాలుడే శిశువును మహిళకు అప్ప గించినట్లు పోలీసులు గుర్తించారు. మనోజ్ రామ్ మాత్రం ఆ పిల్లవాడికి ఏమీ తెలియదని, ఎవరు పిలిస్తే వారితో వెళ్లిపోతుంటాడని అంటున్నాడు. మరోవైపు బాలుడు శిశువును మహిళకు అప్పగించడంపై పలు అనుమా నాలు వ్యక్తం అవుతున్నాయి. శిశువును ఎత్తుకెళ్లిన మహిళ శనివారం కూడా బాధిత కుటుంబంతోనే ఉందని ఇతర పేషంట్లు చెబుతున్నారు. మనోజ్‌రామ్‌తో పాటు అతడి అన్న కొడుకును స్టేషన్‌కు పిలిపించి పోలీసులు విచారణ జరుపుతున్నారు.



శిశువును తీసుకెళుతున్న అనుమానిత మహిళ

● భద్రత ప్రశ్నార్థకం

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని మాతాశిశు ఆసుపత్రిలో నాలుగు రోజుల శిశువు అదృశ్యం కావడం కలకలం సృష్టించింది. మాతాశిశు ఆసుత్రిలో ఒక శిశువును ఒక మహిళ బయటకు తీసుకువెళ్లినా వార్డులోని ఏఎన్ఎంలు, వార్డు బాయ్స్, వైద్య సిబ్బంది ఎవరూ గమనించలేదు. ఉమ్మడి జిల్లా నుంచి నిత్యం వందలాది మంది మాతాశిశు ఆసుపత్రికి వైద్య చికిత్సల కోసం వస్తూపోతూ ఉంటారు. కొందరు ప్రసవం కోసం అడ్మిట్ అవుతుంటారు. మాతా శిశు ఆసుపత్రిలో ఎలాంటి పోలీసు అవుట్‌పోస్ట్ లేదు. ఆసుపత్రిలో అవుట్‌సోర్సింగ్ సెక్యూరిటీపైనే ఆధారపడడంతో భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. తల్లి పక్కలోని శిశువును మహిళ ఎత్తుకుని బయటకు పోతున్నా అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందికి, బయట ఉన్న సెక్యూరిటీకి బాధితులు చేప్పే వరకు తెలియలేదు. ఆసుపత్రిలో, ముఖ్యంగా మెటర్నిటీ వార్డులో సందర్శకుల రాకపోకలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాల్సిన సిబ్బంది ఆ సంగతినే పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాపలాగా ఉన్న సెక్యూరిటీ గార్డులు నిద్రలో ఉండడం శిశువును ఎత్తుకుపోయిన మహిళకు కలిసి వచ్చాయి. సంతానంలేని వారు పిల్లలను దత్తత తీసుకోవడానికి ప్రయత్నించినా అంత తొందరగా సాధ్యంకాక పోవటం, నిబంధనలు కఠినంగా ఉండడంతో అక్రమ మార్గంలో గుట్టుచప్పుడు కాకుండా శిశువులను కొనుగోలు చేస్తున్నారు. ఆసుపత్రుల్లో శిశువుల అపహరణ, శిశువుల తారుమారు, తదితర సంఘటనలు జరుగుతున్నా ఆసుపత్రి యాజమన్యాలు భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శిశువు కోసం ఐదు ప్రత్యేక బృందాల గాలింపు

● అదృశ్యంపై పలు అనుమానాలు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ మాతాశిశు ఆసుపత్రిలో ఆదివారం ఉదయం అదృశ్యమైన ఆడ శిశువు(మూడురోజుల వయస్సు) ఆచూకీ కోసం ఐదు ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. బాలుడి నుంచి శిశువును తీసుకున్న మహిళతో ఒక ఆటోలో కూర్చుంది. ఆ బాలుడు మహిళ వద్ద డబ్బులు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. కాని ఆ బాలుడు తనకేమి తెలియదని చెబుతుండగా, శిశువు తండ్రి మనోజ్‌రామ్ కూడా ఆ బాలుడికి ఏమీ తెలియదని చెబుతుండటం అనుమానాలకు తావిస్తున్నది. బీహారీలకు ఆడ శిశువుపై చిన్నచూపు ఉంటుందని, ఆడ శిశువు అదృశ్యం ఘటనలో కుటుంబ సభ్యుల ప్రమేయం ఏమైనా ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. శిశువును తీసుకువెళ్లిన మహిళను గుర్తించేందుకు ప్రస్తుతం శిశువు తండ్రి మనోజ్‌రామ్‌ను, బాలుడిని పోలీసులు వారి వద్దని ఉంచుకున్నట్లు తెలిసింది.

● మాతాశిశు కేంద్రం టు బస్టాండ్

మాతాశిశు హాస్పిటల్ నుంచి బాలుడి ఇచ్చిన ఆడ శిశువును మహిళ తీసుకుని ఆసుపత్రి ఆవరణ బయట ఆటోలో కూర్చుని కోర్టు చౌరస్తా మార్గంగుండా ఆర్టీసీ బస్టాండ్ వరకు చేరుకున్నట్లు పోలీసులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. అక్కడి నుంచి జమ్మికుంట వైపు వెళ్లినట్లుగా అనుమానిస్తున్నారు. ఆటోలో వెళుతున్న సమయంలోనే జమ్మికుంట ఎటువైపు ఉంటుందని ఆ మహిళ తెలుగులోనే ఆటో డ్రైవర్‌ను అడిగినట్లు చెబుతున్నారు. బీహార్‌కు చెందిన మహిళ అయితే జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో రైల్ ఎక్కి బీహార్‌కు వెళ్లి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీహారీ వలస కార్మికులు తెలుగులో మాట్లాడుతారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం మాతాశిశు హాస్పిటల్ నుంచి బస్టాండ్ వరకు సీసీ కెమెరాలను పరిశీలించి బస్టాండ్‌కు మహిళ వెళ్లినట్లు నిర్ధారించుకున్న పోలీసులు జమ్మికుంట బస్టాండ్, రైల్వే స్టేషన్‌ల వద్ద సీసీ కెమెరాలను జల్లెడపడుతున్నారు. మరో వైపు మాతాశిశు హాస్పిటల్ వద్ద శిశువును తీసుకున్న సమయంలో సెల్‌ఫోన్ టవర్ డంపును సేకరించి అనుమానిత కాల్స్ డాటా పరిశీలిస్తున్నారు. హాస్పిటల్ ఎదుట ఆటోలో శిశువును తీసుకువెళ్ళిన మహిళతో బాలుడు ఏమి మాట్లాడాడనే దానిపై ఆటో డ్రైవర్లను విచారిస్తున్నారు.

మేడారం వెళ్లే మహిళా భక్తులకు
ఉచిత ప్రయాణం



మేడారం జాతర క్యాంపును ప్రారంభిస్తున్న ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత

భగత్‌నగర్, ఫిబ్రవరి 18: మేడారం సమ్మక్క జాతరకు మహిళా భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తోందని టీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత అన్నారు. కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మేడారం సమ్మక్క సారలమ్మ జాత క్యాంపును ఆమె ఆదివారం ప్రారంభించారు. మేడారం ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ వరకు మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తామన్నారు. లయన్స్‌క్లబ్ కరీంనగర్ మీల్స్ ఆన్ వీల్స్ చీఫ్ కో-ఆర్డినేటర్ రావికంటి కృష్ణకిషోర్ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరించుకుని ఇతర రీజియన్‌ల నుంచి వచ్చే సిబ్బందికి భోజన వసతి కల్పించడానికి ముందుకు వచ్చారన్నారు. కార్య క్రమంలో కరీంనగర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) కె సత్యనారాయణ, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు ఎల్ మల్లేశం, వి మల్లయ్య, సూపర్‌వైజర్లు ఆర్ జ్యోత్స్న, విజయలక్ష్మి, కమల, తిరుపతి, నజీర్, వీరస్వామి, అంజయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా
పోస్టల్ ప్రమాద బీమా

- రూ. 10 లక్షల చేయూత
- గాయపడిన వారికి సాయం

భగత్‌నగర్, ఫిబ్రవరి 18: భారత తపాల శాఖ రోజు రోజుకు వినియోగదారులకు సేవలు విస్తరిస్తున్నది. ప్రజలకు చేయూత నందించేందుకు గాను కొత్త కొత్త స్కీంలుప్రవేశపెట్టి వినియోగదారుల మన్ననలు పొందుతున్నది. నిత్యం ఉత్తరాల బట్వాడా, చిన్న మొత్తాల పొదుపు ఖాతాలోనే సరిపెట్ట కుండా ప్రజలకు మరింత చేయూతగా నిలవాలనే సంకల్పంతో పథకాలను ప్రవేశపెట్టి వినియోగదారులకు అండగా నిలుస్తున్నది. భారత తపాల శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన పోస్టల్ ప్రమాద బీమా పథకం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్నది.

● దరఖాస్తు చేసిన వెంటనే ఖాతాల్లో జమ

తపాల ప్రమాద బీమా చేసుకున్న వారు మరణిస్తే దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరైన పది లక్షల రూపాయలను నేరుగా నామిని బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. కరీంనగర్ డివిజన్ వ్యాప్తంగా తపాల శాఖ ఆధ్వర్యంలో తపాల ప్రమాద బీమా చేసుకున్న 21 మంది మృతి చెందగా, వారికి ప్రమాద బీమా సొమ్మును అందించారు. గాయాలతో చికిత్స పొందిన 40 మందికి క్లైమ్స్ అందించింది. ప్రమాద బారిన పడిన 21 మందికి ఒక్కొక్కరికి పది లక్షల రూపాయల చొప్పున, గాయపడిన 40 మందిలో పది వేల నుంచి 70 వేల రూపాయల వరకు ప్రమాద బీమా సాయం అందించింది. పోస్టల్ శాఖ. గత సంవత్సరం యాభై వేలమంది ప్రమాద బీమాచేసుకోగా, ఈ సంవత్సరం ఇప్పటి వరకు కరీంనగర్ డివిజన్ వ్యాప్తంగా 25 వేల మంది ప్రమాద బీమా చేసుకున్నారు.



ప్రమాదబీమా చెక్కును బాధితులకు అందిస్తున్న పోస్టల్ సిబ్బంది (ఫైల్)

● రేపటి నుంచి స్పెషల్ డ్రైవ్

ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ప్రమాద బీమా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఐదు ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా మూడు రకాల పాలసీలను అందుబాటులోకి తీసుకువచ్చారు. 5 లక్షలు, 10 లక్షలు, 15 లక్షల రూపాయల పాలసీలు 320 రూపాయల నుంచి మొదలుకొని 775 రూపాయల వరకు అందుబాటులో ఉన్నాయి. ప్రమాద బీమా తీసుకునే వారు 200 రూపాయలతో ఐపీపీబీ ఖాతా తెరవాల్సి ఉంటుంది. వినియోగదారులకు వీలైన పాలసీని ఎంచుకుని దగ్గరలోని పోస్టాఫీసుల్లో సంప్రదిస్తే ప్రమాద బీమా పాలసీని తీసుకునే విధంగా పోస్టల్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- శివాజి, కరీంనగర్ డివిజన్ పోస్టల్ ఎస్పీడీ



తపాల శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ప్రమాద బీమా పాలసీ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలి. ఈ నెల 20 నుంచి చేపట్టనున్న స్పెషల్‌డ్రైవ్‌లో పాలసీలు పొందాలి. ఆసక్తి ఉన్న వారు సమీప పోస్టాఫీసును సంప్రదించాలి.



ద్విచక్ర వాహనం పైనుంచి పడి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 18: కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రం నుంచి గంగారంకు వెళ్లే దారిలో ఆదివారం టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన మల్లయ్య అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై పడి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో కాల్వ శ్రీరాంపూర్ నుంచి కారులో పెద్దపల్లికి వెళ్తున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ తలకు గాయమైన మల్లయ్యను తన డ్రైవర్ సహాయంతో కారులో ఎక్కించుకుని కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం బాధితుడి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఓంకార్‌యాదవ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మల్లయ్యకు మెరుగైన వైద్య చికిత్స కోసం పెద్దపల్లికి తరలించారు. మల్లయ్యను సకాలంలో ఆసుపత్రికి తీసుకు రావడం పట్ల అతని కుటుంబ సభ్యులు సారయ్యగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

గంభీరావుపేట, ఫిబ్రవరి 18: గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో జగిత్యాల జిల్లా పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆదివారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. గ్రామీణ వ్యవస్థాపక అవగాహన అభివృద్ధి యోజన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులు సాగు చేస్తున్న పంటల విధానం, దిగుబడి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సామాజిక వనరులు, సమస్యల చెట్టు, కాలానుగున పటం తదితర అంశాలపై ముగ్గులతో చిత్రాలు వేసి రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గౌతమి, సాయి తేజ, అజయ్, మాజీ సర్పంచ్ సరళ రాజనర్సింహారెడ్డి, నాయకులు సేనరెడ్డి, రాజు, శ్రీనివాస్, నరసింహ పొలాస విద్యార్థులు ఉన్నారు.


కొత్తపల్లిలో అవగాహన కల్పిస్తున్న పొలాస విద్యార్థులు

జాతీయ స్థాయి ఉత్సవాలకు చిల్వకోడూర్ విద్యార్థులు



జాతీయ స్థాయి ఉత్సవాలకు ఎంపికైన విద్యార్థులు

గొల్లపల్లి, ఫిబ్రవరి 18 : నేటి నుంచి ఢిల్లీలో జరగనున్న కబ్, బుల్ బుల్ ఉత్సవాలకు గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులు ఆదివారం దేశ రాజధానికి తరలివెళ్లారు. ప్రతి యేటా జాతీయ స్థాయిలో కబ్, బుల్ బుల్ ఉత్సవాలను కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. మూడు ఏళ్లుగా కరోనా మహమ్మారి కారణంగా ఉత్సవాలను నిర్వహించలేదు. ఈ యేడు నిర్వహిస్తుండడంతో తెలంగాణ రాష్ట్రం తరఫున చిల్వకోడూర్ విద్యార్థులు ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆహ్వానం అందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్. అరుణ తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యార్థులు పాల్గొనే ఈ ఉత్సవాలకు మన రాష్ట్రం తరపున మా విద్యార్థులు ఎంపికవడం గర్వకారణంగా ఉందని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన గట్ల అభినవ్, కూన సాయి, బద్రి అనిరుద్, సికినికాంతం శివసాయి, గౌడికర్ రుత్విక్, ఒల్లాల రుషి అనే విద్యార్థులు కబ్ బుల్ బుల్ ఉత్సవాలకు ఎంపికయ్యారు. కబ్ గ్రీటింగ్, జంగిల్ ప్లే, బాలుర నృత్యం, ఉత్సవ్ మేళా తదితర అంశాల్లో ఎంపికైన విద్యార్థులకు కబ్ మాస్టర్ వినోద్ గౌడ్ శిక్షణ ఇచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

కుక్కల దాడిలో 28 గొర్రెలు మృతి


జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 18: జగిత్యాల మండలం మోతె గ్రామంలో ఆదివారం కుక్కలు గొర్రెలపై దాడి చేసి గాయపర్చిన సంఘటనలో 28 గొర్రెలు మృతి చెందాయి. అలాగే జగిత్యాల రూరల్ మండలంలోని హన్మాజీపేట గ్రామంలో గతంలో కుక్కలు పశువులపై దాడిచేయడంతో పశువులు మృతిచెందిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో కుక్కల బెడద అధికమైంది. రద్దీకూడళ్లు, రోడ్ల వెంట కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడులకు దిగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఏదోఒకచోట నిత్యం కుక్కకాటు బాధితులు ఉంటున్నారు.



మృతిచెందిన గొర్రెలు











అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 18: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో అనారోగ్యంతో గుండం రాజు(32) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా అంబారిపేట గ్రామానికి చెందిన గుండం రాజు మూడు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకుని ఇందిరమ్మకాలనీలో జీవిస్తున్నాడు. రెండు సంవత్సరాల క్రితం ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లగా అనారోగ్యం బారిన పడి ఏడు నెలల క్రితం స్వదేశానికి తిరిగి వచ్చాడు. అనారోగ్యంతో పనిచేయలేని పరిస్థితిలో తీవ్ర మనస్తాపానికి గురైన రాజు ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా : ముగ్గురికి గాయాలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 18: సిరిసిల్ల పట్టణం బైపాస్ రహదారి కల్వర్టుపై అతివేగంగా వెళ్తున్న ఓ కారు బోల్తా పడింది. ఆదివారం రాత్రి రగుడు బైపాస్ నుంచి వెంకటాపూర్ వైపు ముగ్గురు ప్రయాణికులతో కారు అతి వేగంగా వెలుతూ డ్రైవర్ బ్రేకు వేయడంతో కల్వర్టు వద్ద మూడు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని టౌన్ ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సారెస్పీ డీ-53 ఉప కాలువ కబ్జా

గొల్లపల్లి, ఫిబ్రవరి 18: గొల్లపల్లి మండలం బొంకూర్ రెవెన్యూ శివారులోని ఎస్సారెస్పీ డీ-53 ఉప కాలువను కొందరు రైతులు పూడ్చి వేయడంతో ఆయకట్టు కింది రైతుల పంట పొలాలకు సాగు నీరందడం లేదు. అరుగాళం చమటోడ్చి సాగు చేసిన పంట పొలాలకు సాగు నీరందక కళ్లెదుటే ఎండి పోతుండడంతో బాధిత రైతాంగం ఆందోళన చెందుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బొంకూర్ గ్రామ రెవెన్యూ శివారులో ఎస్సారెస్పీ డీ-53 కాలువ కింద ఆయకట్టు కింది రైతుల పంట భూములకు సాగు నీరందించేందుకు దశాబ్దాల క్రితం ఉప కాలువ (పిల్ల కాలువ)ను రైతుల పంట భూముల్లోంచి నిర్మించారు. అయితే, ఇటీవల కాలంలో కొందరు రైతులు ఉప కాలువను చదును చేసి కబ్జా చేయడంతో ప్రస్తుతం అక్కడ ఉప కాలువ నామరూపాల్లేకుండా పోయింది. అక్కడక్కడ కొందరు రైతులు కాలువను ముట్టుకోకుండా ఉంచగా, అందులో పిచ్చి మొక్కలు పెరిగి, బండరాళ్లు పడి అస్తవ్యస్తంగా తయారై కింది పంట భూములకు సాగు నీరందని దుస్థితి నెలకొంది. కొందరు రైతులు కాలువను పూడ్చివేసి యథేచ్ఛగా పంటలను సాగు చేస్తున్నారు. సుమారు 80 ఎకరాలకు సాగు నీరందించేందుకు ఈ ఉప కాలువను ఏర్పాటు చేసినట్లు రైతులు పేర్కొంటున్నారు. అయితే, మీది రైతులు కాలువను కబ్జా చేయడంతో ఆయకట్టు కింది రైతుల పంటల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. అసలే, ఎస్సారెస్పీ డీ-53 చివరి ఆయకట్టుకు సాగు నీరు ఎప్పుడొస్తదో తెలియని పరిస్థితుల్లో ఆయకట్టు కింది చివరి పంట భూములకు సాగు నీరందక రైతులు తల్లడిల్లుతున్నారు. దీనిపై గతంలో జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని పలువురు బాధిత రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా ఆడిషనల్ కలెక్టర్ ఉప కాలువను పునరుద్ధరించాలని ఇచ్చిన ఆదేశాలను సైతం బేఖాతరు చేసినప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి ఉప కాలువను పునరుద్ధరించి ఆయకట్టు కింది పంట పొలాలకు సాగు నీరందించాలని బాధిత రైతాంగం కోరుతున్నారు.


డీ-53 కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు


పూర్తిగా తొలగించిన ఉప కాలువ

సాగు నీరందక పంటలు ఎండిపోతున్నాయి
- మాదాసు కార్తీక్, యువరైతు, బొంకూర్

ఎస్సారెస్పీ డీ-53 ఉప కాలువ కింద 8 ఎకరాల సాగు భూమి ఉంది. ఎస్సారెస్పీ సాగునీటిని నమ్ముకుని పంటలు సాగు చేస్తున్నాం. ఎగువ ప్రాంతంలో ఉన్న కొందరు రైతులు ఉప కాలువను పూర్తిగా పూడ్చి వేసి కాలువను కబ్జా చేశారు. దీంతో తమ పంట పొలాలకు సాగు నీరందక ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి సాగు చేసిన పంటపొలాలు ఎండిపోయే ప్రమాదం పొంచిఉంది. దీనిపై గతంలో పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. అరుగాళం కష్టించి సాగు చేసిన పంట చేతికందకుండా పోతే తమ కుటుంబాలు పస్తులుండాల్సిందే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి ఉప కాలువను పునరుద్ధరించి పంటపొలాలకు సాగు నీరందించాలి.

మా దృష్టికి రాలేదు
-మహేష్, ఎస్సారెస్పీ ఏఈ

ఎస్సారెస్పీ డీ-53 ఉప కాలువ కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి రాలేదు. ఆయకట్టు కింది చివరి పంట భూములకు సాగు నీరందించేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎస్సారెస్పీ కాలువలను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటివరకు మండలంలోని అబ్బాపూర్ - లొత్తునూర్ గ్రామాల మధ్య ఉన్న డీ-53 కాలువ గూర్చి ఫిర్యాదులు అందినవి. బాధిత రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దానిని క్షేత్రస్థాయిలో పరిశీలించాం. అయితే, అక్కడ వరి పంట వేయడం వల్ల పరిష్కారానికి కొంత సమయం పడుతుంది. యాసంగి వరి పంటల కోతలు పూర్తి కాగానే సమస్యను పూర్తిగా పరిష్కారిస్తాం.

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 18: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు ముందు శ్రీ రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకునే ఆనవాయితీ ప్రకారం ఆదివారం పెద్దసంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అధిక రద్దీ కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి శీఘ్ర దర్శనం అమలు చేస్తున్నారు. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. భారీ సంఖ్యలో భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గత వారంతో పోలిస్తే భక్తుల సంఖ్య స్వల్పంగా తగ్గినప్పటికీ స్వామివారి దర్శనం త్వరగా జరగడానికి వీలుగా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టారు.


క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

రాజన్న సేవలో సంగారెడ్డి ఎస్పీ

వేములవాడ: రాజరాజేశ్వరస్వామి వారిని సంగారెడ్డి జిల్లా ఎస్పీ సి. రూపేష్ దర్శించుకున్నారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు బి తిరుపతిరావు, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, సీఐ కరుణాకర్, ఎస్ఐ దిలీప్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోనరావుపేట, ఫిబ్రవరి 18 : కోనరావుపేట మండలం సుద్దాల గ్రామశివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదరికి గాయాలు అయ్యాయి. వివరాల ప్రకారం కనగర్తి గ్రామానికి చేందిన కాదాసు వేణు అదే గ్రామానికి చేందిన మరో వ్యక్తి వేములవాడ నుండి తన ద్విచక్ర వాహనంపై కనగర్తి గ్రామానికి వస్తుండగా సుద్దాల గ్రామ శివారలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సుద్దాల నుండ్డి ఎదురుగా వస్తున్న కారు బైకును డీ కోట్టి వేల్లి పోయింది. దీంతో ఇద్దరి కిందపడి పోగ కాదాసు వేణుకు కాలు విరుగగా మరోకరికి గాయాలు అయ్యాయి. విరి ఇ ద్దరిని 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల జిల్లా అస్పత్రికి తరలించారు.

ప్రయాణికురాలి బ్యాగు నుంచి రూ. లక్ష మాయం

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 18: సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఓ ప్రయాణికురాలి నుంచి లక్ష రూపాయలు మాయమైన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. కోనరావుపేట మండలంలోని మల్కపేట గ్రామానికి చెందిన లిఖిత ఓ బ్యాగులో లక్ష రూపాయలు పెట్టుకొని ముస్తాబాద్‌లోని ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు ఇంటి వద్దనే ఆటో ఎక్కింది. సిరిసిల్లలోని పాత బస్టాండ్‌కు చేరుకొని ముస్తాబాద్ వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సు ఎక్కిన కొంతసేపటికి ఆమె బ్యాగ్ చూసుకుంది. అందులో ఉన్న లక్ష రూపాయలు మాయం అయ్యాయి. ఇంతకీ ఆ రూ. లక్ష బస్సులో ఎక్కేటపుడు ఎవరైనా కొట్టేశారా, ఆటోలో వచ్చేటపుడే ఎవరైనా తీసుకున్నారా అనేది ప్రయాణికురాలికి తెలియడం లేదు. దీంతో బస్సు దిగి పోలీసులకు సమాచారం ఇచ్చింది. టౌన్ సీఐ రఘుపతి, టౌన్ ఎస్ఐ శ్రీనివాసరావు పాతబస్టాండ్ చేరుకొని ఆర్టీసీ బస్సును తనిఖీ చేశారు. దీంతో ఆ బస్సు దాదాపు అరగంట ఆగిపోయింది. ఆ తర్వాత ఆటోలో వచ్చిన ప్రయాణికుల వివరాలను సేకరించారు. ఎక్కడా ఆ డబ్బుల జాడలేదు. చివరికి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

చెట్టు పైనుంచి పడి ఒకరి మృతి

ధర్మారం, ఫిబ్రవరి18: ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన పీసు రఘునందన్‌రెడ్డి(65) ఆదివారం ఉదయం చెట్టుపై నుంచి పడి ప్రమాదవశాత్తు కాలు జారి మృతిచెందాడు. రఘునందన్‌రెడ్డి చింతకాయలు తెంపడానికి చెట్టు పైకి ఎక్కాడు. చింతకాయలు తెంపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు రవీందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

ప్రమాదకరంగా రహదారులు


ప్రమాదకరంగా ఉన్న రహదారి

రాయికల్, ఫిబ్రవరి 18: రాయికల్ మండలంలో రహదారులు ప్రమాదకరంగా మారాయి. రాయికల్ నుంచి కోరుట్ల వెళ్లే రహదారిలో మైతాపూర్ బస్టాండ్ వద్ద గతంలో వర్షాలధాటికి ఆర్ అండ్ బీ రోడ్డుకు పోసిన మట్టి కొట్టుకుపోయింది. దీంతో వాహనదారులు భయం గుప్పిట్లో ప్రయాణిస్తున్నారు. రాత్రి పూట సమయంలో వెళ్లే వాహనదారులు ఏమాత్రం పట్టు కోల్పోయినా ప్రాణాలకే నష్టం కలుగుతుంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకు ఇరువైపులా మట్టి పోసి భద్రత కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. రోడ్లు బాగు చేసి ప్ర

ఐఐటీ సదస్సుకు ముగ్గురు ఎస్జీటీలు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 18: గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ ఐఐటీలో ఈనెల 21 నుంచి జరగనున్న వర్క్‌షాప్‌లో జిల్లా నుంచి ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లు పాల్గొనబోతున్నారు. సెంటర్ ఫర్ క్రియేటివ్ లెర్నింగ్ సీసీఎల్ ఆధ్వర్యంలో మూడు విడతలుగా ఈ కార్యశాల నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన కర్రే ప్రవీణ్, జూలపల్లి మండలానికి చెందిన నల్ల రాజేందర్ రెడ్డి, పాలకుర్తి మండలానికి చెందిన సిహెచ్ కుమార్‌లు ఈ వర్క్ షాప్‌లో పాల్గొంటారని జిల్లా విద్యాధికారి కార్యాలయ వర్గాలు వెల్లడించారు. గతవారం గణితం టీచర్లు వర్క్‌షాప్‌లో పాల్గొనగా మార్చి మొదటి వారంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ఐఐటీ గాంధీనగర్ కార్యశాలలో పాల్గొననున్నారు. కాగా ఈ నెల 21 నుంచి ఆంగ్ల భాష ఉపాధ్యాయులు జిల్లాకు చెందిన ముగ్గురు ఎస్జీటీలను ఎంపిక చేసి పంపుతున్నట్లు వారు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న కాలనీవాసులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 18: సిరిసిల్ల పట్టణం మానేరు వాగులో నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అయ్యప్ప కాలనీవాసులు ఆదివారం అడ్డుకున్నారు. అనంతరం సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు, ట్రాక్టర్ యజమానాలతో అయ్యప్ప కాలనీ వాసులు వాగ్వాదం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ సిరిసిల్ల అయ్యప్ప కాలనీ నుంచి ఇసుక ట్రాక్టర్లు వెల్లడంతో రోడ్లు చెడిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పట్టణ పోలీసులు, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కాలనీ వాసులందరం కలిసి ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నామన్నారు. జేసీబీతో రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లు వెల్లకుండా గోతి తీయడానికి యత్నించడంతో పోలీసులు, ట్రాక్టర్ల యజమానులు అడ్డుకున్నారు. తమ వీధుల నుంచి వందల సంఖ్యలో ట్రాక్టర్లు వెల్తుండడంతో పిల్లలు పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని, దుమ్ము లేవడంతో తరుచూ అనారోగ్యాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ట్రాక్టర్ యజమానులను నిలదీశారు. స్థానిక అవసరాల కోసం తాము ఇసుక అనుమతులతో తీసుకెల్తున్నామని ట్రాక్టర్ యజమానులు కాలనీవాసులకు తెలిపారు. రోడ్లు చెడిపోతే రోడ్డు గుంతలను పూడుస్తామన్నారు. అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దు మనిగింది.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి


రమేష్‌గౌడ్(ఫైల్)

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 18: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందనే మనోవేదనతో కరీంనగర్ జిల్లా కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పూదరి రమేష్‌గౌడ్ (40) గుండెపోటుతో ఆదివారం మృతిచెందాడు. రమేష్‌గౌడ్ 16 సంవత్సరాలుగా ఆటోను నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా ఆటోలో గిరాకీ లేక కుటుంబాన్ని ఎలా పోషించేదని, నెల వారి ఈఎంఐలు ఎలా కట్టేదని తీవ్ర వేదనకు గురయ్యాడు. ఆదివారం ఛాతిలో నొప్పి వస్తుందని కుప్ప కూలి పోగా, వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. ఆటో డ్రైవర్ కుటుంబానికి ప్రభుత్వం పది లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు.

ఇండియా కూటమి నినాదం 'బీజేపీకి హఠావో.. దేశ్‌కి బచావో..'

- మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించి కేసీఆర్ మొదటి తప్పు చేశాడు
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 18 : వామపక్షాలు, ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తులు లౌకికశక్తులతో కలసి 'బీజేపీకి హటావో దేశ్‌కి బచ్చావో' నినాదంతో ఇండియా కూటమి ప్రజల వద్దకు వెళ్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడారు. బీజేపీ, ఎండీఏ కూటమిని ఓడించడానికి ఇండియా కూటమిలోని కాంగ్రెస్ పార్టీ అందరని కలుపుకొని పోవాలని లేకుంటే కాంగ్రెస్‌కే నష్టమన్నారు. సాగునీటి చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలి, రైతులకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరోనాతో కనీస సౌకర్యాలు లేక దేశ వ్యాప్తంగా దాదాపు 20 కోట్ల కార్మికులు పొట్ట చేత్తోపట్టుకొని వలసలు వెల్తున్నారని అన్నారు. వ్యవసాయదారులు, కార్మికులను కేంద్ర ప్రభుత్వం బజారు పాలు చేస్తుందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ధరలను పెంచి సామాన్యుడి నడ్డివిరుస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. మోదీ ప్రభుత్వం బాలరామున్ని తీసుకొచ్చి రామరాజ్యం అంటుందన్నారు. రామరాజ్యం అంటే డ్రోన్ల ద్వారా రైతులపై భాష్పవాయువు ప్రయోగించడమా, లాఠీ చార్జీ చేయడం అన్ని ప్రశ్నించారు. రాముడు తండ్రికి ఇచ్చిన మాటకు కట్టుబడి అరణ్యవాసం చేశాడు. నరేంద్ర మోదీ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి లేదు అన్ని అబద్దాలేనని అమలు కాని మాటలేనని ఆరోపించారు. మతోన్మాదం తీసుకొచ్చి మరోసారి ప్రజాస్వామ్యంను కూనీ చేయడానికి ప్రయత్నిస్తే మీ నాటకాలు సాగవని హెచ్చరించారు. మొదటి నుండి శ్రీరాంసాగర్ వరదకాలువ, ఎగువమానేరు వచ్చే వరదకాలువలు ఎందుకు కాలేదని ప్రశ్నిం చారు. మీ అధికారంతో ఇష్టానుసారంగా మీ ప్రాంతాలలో పనులను చేసుకు న్నారని ప్రభుత్వ నిధులను వాడుకున్నారని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యాదర్శి పంతం రవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం బాలమహేష్, జంగం అంజన్న, అజ్జ వేణు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

తాండ్ర్యాలలో పశువుల కొట్టం దగ్ధం

కథలాపూర్, ఫిబ్రవరి 18: మండలంలోని తాండ్ర్యాలలో ఆదివారం మధ్యాహ్నం బద్దం గంగారెడ్డి అనే రైతుకు చెందిన పశువుల కొట్టం దగ్ధమైంది. మంటలు చెలరేగడంతో గ్రామస్థులు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. తదనంతరం ఫైర్ ఇంజిన్ రావడంతో సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారనే అనుమానాలు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కొట్టంలో ఉన్న పశుగ్రాసంతో పాటు విలువైన టేకు దుంగలు, ఇతరత్రా వ్యవసాయ సంబంధిత వస్తువులు కాలి బూడిదయ్యాయి. మధ్యాహ్నం వేళ కావడం వల్ల పశువులు కొట్టం లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బాధిత రైతు కుటుంబం రోదిస్తోంది. ఈ ఘటనలో సుమారు రూ.6 లక్షల ఆస్తి నష్టం జరిగిందని రైతులు తెలిపారు.


తాండ్ర్యాలలో దగ్ధమైన పశువుల కొట్టం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మల్యాల, ఫిబ్రవరి 18: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు ఆదివారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గొల్లపల్లెకు చెందిన పెరుగు శేఖర్(25)అనే యువకుడు శనివారం రాత్రి జగిత్యాల నుంచి వస్తుండగా రాజారం వద్ద శేఖర్ ద్విచక్రవాహనం, మరో ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. దీంతో శేఖర్ తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కరీంనగర్ తీసుకెళ్లగా ఆదివారం వేకువజామున చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీసీ కుల గణనపై అసెంబ్లీలో తీర్మానం హర్షణీయం



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘాల నాయకులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో బీసీ కుల గణన చేయడానికి అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశి పెద్ది శ్రీధర్ రాజు, బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సిరిశెట్టి రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు పెరిగితే తదనుగుణంగా సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. బీసీ సబ్ ప్లాన్, బీసీ విద్యార్థుల ఫీజుల కోసం తగిన నిధులు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో బీసీల అభివృద్ధి జరుగుతుందని బీసీ సంఘాల పక్షాన ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ మియాపూర్ రవీంద్ర చారి, బీసీ సంఘాల నాయకులు శ్రీనివాస్, రమేష్, రాజు, వినోద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నైపుణ్య శిక్షణ



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి18: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నాంది ఫౌండేషన్ ద్వారా మహేంద్ర ప్రైడ్ క్లాసు ట్రైనింగ్ నిర్వహించారు. ఈ మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ ట్రైనింగ్ 12 ఫిబ్రవరి నుంచి 17 ఫిబ్రవరి వరకు రెండు బ్యాచ్‌లు జరిగాయి. 120 మంది విద్యార్థులు శిక్షణ పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. టి.శ్రీలక్ష్మీ తెలియజేశారు. టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.శోభరాణి, ఈ ఎంపీసీ శిక్షణ ద్వారా లైఫ్ స్కిల్స్, ఎంప్లాయబిలిటీ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఆప్టిట్యూడ్ గురించి శిక్షణ ఇచ్చారు. మహీంద్రా ప్రైడ్ క్లాస్‌రూం నుంచి వచ్చినటువంటి ట్రైనర్ ఓం ప్రకాష్ చివరి రోజు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఎఫ్‌టియం జి.రాజశేఖర్, ఫైనల్ సెమిస్టర్ విద్యార్థులు ఉన్నారు.

రావూస్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



విద్యార్థులు తయారు చేసిన వంటకాల ప్రదర్శన

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 18: నగరంలోని రావూస్ పాఠశాలలో ఆదివారం ఫిట్‌రావూస్ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. ఈసందర్భంగా పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఎలాంటి పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలో తెలియపరుస్తూ, విద్యార్థులు తెచ్చిన ఆహారాన్ని స్టాల్స్‌లో ఉంచి విక్రయించిన ఫండ్స్‌ను జమ చేయడం జరిగిందని అన్నారు. ఈ ఫండ్స్ ద్వారా వచ్చిన రూపాయలను అనాథ శరణాలయానికి ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో నితిన్‌రావు, ప్రిన్సిపాల్ రహమాన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో క్రైస్తవుల శాంతి ర్యాలీ



హుజూరాబాద్‌లో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 18: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ గ్రామంలో క్రైస్తవులపై దాడిని నిరసిస్తూ ఆదివారం హుజూరాబాద్ పట్టణంలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దాడులు చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని అంబేద్కర్ చౌరస్తా వద్ద డిమాండ్ చేశారు. అనంతరం పాస్టర్లు మాట్లాడుతూ సర్వమత సమ్మేళనంగా చెప్పబడే భారతదేశంలో ఇలాంటి దాడులు జరగడం బాధకరమన్నారు. ఈ ఘటనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు నవీన్, కుమార్, రాజ్‌కుమార్, సతీష్, ఉదయ్‌కుమార్, ప్రభాకర్, దేవదాస్, సొల్లు బాబు, బాపయ్య, బిక్షపతి, కవిత, నవీన్, కృపరాజు, సరళ పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో ఘనంగా వీడ్కోలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

రామడుగు, ఫిబ్రవరి 18: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ ఉన్నత పాఠశాలలో వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి బాగా చదువుకోవాలని అన్నారు. వీడ్కోలు సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడిగడ్డ ప్రాజెక్టును ప్రభుత్వమే కాపాడాలి

మానకొండూర్, ఫిబ్రవరి 18: డిజైనింగ్, నిర్వహణ లోపంతోనే మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోయాయని వాటిని రాష్ట్రప్రభుత్వమే కాపాడి తప్పు చేసిన వారిని శిక్షించాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మానకొండూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణలోని భూమినంతటికీ సాగునీరందించామన్నారు. కాకతీయ కాల్వల ద్వారా మిడ్ మానేరు, ఎల్ఎండీ ద్వారా చెరువులు, కుంటలను నింపడం జరిగిందన్నారు. రైతులకు విద్యుత్, సాగునీరు సకాలంలో అందకపోవడంతో రబీ పంట ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. తప్పు ఎక్కడ జరిగిందో గుర్తించి విచారణ చేపట్టి శిక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు, స్థానిక జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు

-ధ్వంసమైన కిటికీల అద్దాలు -అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం





జమ్మికుంటలో పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పగిలి పోయిన కిటికీల అద్దాలు

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 18: జమ్మికుంటలో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు ప్రస్తుతం నిరూపయోగంగా మారాయి. కొన్ని బ్లాకుల నిర్మాణాలు పూర్తి కాగా, మరికొన్ని బ్లాకులు పిల్లర్లు, స్లాబ్ లెవల్ వరకు పూర్తి అయ్యాయి. గుత్తేదారు ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో కొంతకాలంగా నిర్మాణ పనులు నిలిపి వేశారు. వాటిపై ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. గుర్తు తెలియని వ్యక్తులు కిటికీల అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. సామగ్రిని చిందరవందర చేశారు.

● జమ్మికుంటకు 500 ఇళ్లు మంజూరు

జమ్మికుంట పరిధిలో 500 డబుల్ బెడ్‌రూం ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సమీపంలో ఐదేళ్ల క్రితం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. 20బ్లాక్‌ల నిర్మాణ పనులు పూర్తి కాగా, మరో మూడు బ్లాకుల్లో ఇళ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఒక్కో బ్లాక్‌కు 12 డబుల్ బెడ్‌రూం ఇళ్ల చొప్పున 240 ఇళ్లు ఉన్నాయి. మారుతినగర్‌లోని 9బ్లాకుల్లో 108 ఇళ్లు బేస్‌మెంట్, పిల్లర్లు, స్లాబ్ లెవల్‌లో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ధర్మారం పరిధిలో 152 ఇళ్లు పూర్తి అయ్యాయి.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రాంతంలో కనీసం స్ట్రీట్ లైట్లు కూడా లేకపోవడంతో చీకటి అయితే చాలు పోకిరీలు బైక్‌లపై వస్తూ మందు, సిగరెట్లు, గంజాయి సేవిస్తూ హల్‌చల్ చేస్తున్నారు. దీంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు, కాలి నడకన వెళ్లే ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు.

● కొరవడిన అధికారుల పర్యవేక్షణ

అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. చెత్తాచెదారంతో నిండి పోయాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణాలు పూర్తి అయిన డబుల్ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. అసంపూర్తిగా మిగిలిన పనులను సైతం త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మాదిగల జోడో యాత్రను విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 18: ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఎస్సీ వర్గీకరణ కోసం మదిగలను ఐక్యం చేసేందుకు ఈనెల 23న జిల్లా కేంద్రంలో తలపెట్టిన మాదిగల జోడో యాత్రను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మెడపట్ల దుబ్బయ్య పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పది జిల్లాల్లో ఈనెల 21 నుంచి 29 వరకు నిర్వహించే ఈ యాత్ర హైదరాబాద్‌లో ప్రారంభమై 23న కరీంనగర్‌కు చేరుకుంటుందన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్, జగిత్యాల జిల్లా మాదిగ యూత్ అధ్యక్షుడు డి చైతన్య, కరీంనగర్ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీనివాస్, లంక తిరుపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతరకు మేయర్‌కు ఆహ్వానం



మేయర్ సునీల్‌రావుకు ఆహ్వానపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 18: రేకుర్తిలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు రావాల్సిందిగా నగర మేయర్ యాదగిరి సునీల్‌రావుకు ఆదివారం ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో జాతర అధికారి ఎండపెల్లి మారుతి, వ్యవస్థాపక చైర్మన్ పిట్టల శ్రీనివాస్, కార్పొరేటర్ సుదగోని మాధవి కృష్ణకుమార్, జూనియర్ అసిస్టెంట్ గుడికాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను అభ్యంతరాలపై దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 18: నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తిపన్ను చెల్లింపులపై ఏమైనా అభ్యంతరాలుంటే కమిషనర్‌ను కలిసి దరఖాస్తు సమర్పించవచ్చని నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీతో ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున అభ్యంతరాలేమైనా ఉంటే ప్రతి మంగళవారం, శుక్రవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ సదవకాశాన్ని ఆస్తి పన్ను చెల్లింపు బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను కొనసాగిస్తాం



భాగ్యరెడ్డి వర్మకు నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 18: భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను కొనసాగిస్తామని వివిధ దళిత సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం మాతాశిశు ఆరోగ్యకేంద్రం సమీపంలో గల భాగ్యరెడ్డి వర్మ విగ్రహం వద్ద భాగ్యరెడ్డి వర్మ 85వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ హైదరాబాద్‌లో 150 పాఠశాలలను స్థాపించి ఎంతో మందికి విద్యాదానం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో దళిత, సామాజిక సంఘాల నాయ కులు స్వచ్ఛంద సంస్థల నాయకులు కొరివి అరుణ్ కుమార్, మేడి మహేశ్, కొరివి వేణు గోపాల్, తాళ్ళ వెంకటేశ్, గంటల మహేందర్, పాటాకుట భూమయ్య, నాయని ప్రసాద్, కుక్క లక్ష్మీరాజం, కర్నే పవన్ కుమార్, సానాది వెంకటేష్, కాంపల్లి రమణకుమార్, ఇరుకుల్ల యాదగిరి, గోపాల భూషన్‌రావు, బుర్ర సోమయ్య, శ్రీపాది సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 18: సీవీరామన్ సైన్స్ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ ఈ-టెక్నో విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకులు సాధించారు. ఆదివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సైన్స్‌లో పలు సంస్కరణలు రూపొందించిన గొప్ప వ్యక్తి సీవీ రామన్ అన్నారు. రామన్ ప్రవేశపెట్టిన సిద్ధాంతాలు నేటికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు.

సైన్స్‌లో పట్టు సాధించడానికి పాఠశాలలోనే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి అర్హత పరీక్షల్లో ర్యాంకులు సాధించే విధంగా కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయిలో శివస్మరణ్‌రెడ్డి, అన్షుల్, కె శ్రీచరణ్‌రెడ్డిలు ర్యాంకులు సాధించగా జిల్లా స్థాయిలో ఎస్‌పి క్రిష్ణచైతన్య, ఎస్ వినాయక్, జిసాయి సంహిత్, సహర్ష్‌లతో పాటు ఎంతోమంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి అభినం దించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, పలువురు ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అండగా ఉంటా

● ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి ● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్



వొడితెల ప్రణవ్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

జమ్మికుంట, ఫిబ్రవరి 18: అనాథ పిల్లలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలోని పత్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో బాల వికాస ఆధ్వర్యంలో అనాథ పిల్లల పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన ఆయన కేక్ కట్ చేసి పిల్లలకు తినిపించారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ అనాథ పిల్లల పుట్టిన రోజు వేడు కలు ఇంత ఘనంగా చేయడం సంతోషంగా ఉందన్నారు. వారి ఉన్నత చదువులకు తన వంతు ఆర్థిక సహాయం ఎల్లపుడూ ఉంటుందన్నారు. కన్న తల్లిని ఉన్న ఊరును మర్చి పోకుండా విదేశాల్లో ఉన్న బాలక్క ఇక్కడ సమాజ సేవలు చేయడం గొప్ప విషయం అన్నారు. కాలుష్యం పెరిగి ప్రజలకు అనారోగ్యానికి గురి అవుతున్నారని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ప్లాస్టిక్ నిషేధించాలని, బాల వికాస పేరుతో బుట్ట బ్యాగులు తయారు చేపించి అందరికీ అందజేయాలని, తన వంతు సహాయం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొనగంటి మల్లయ్య, గూడెపు సారంగపాణి, కసుబోజుల వెంకన్న, సుంకరి రమేష్, పర్లపల్లి నాగరాజు, ఎండి సలీం, టిజిపిఏ రాష్ట్ర అధ్యక్షులు అంబాల ప్రభాకర్, ఎనిమిల్ల రాజేంద్రప్రసాద్, బాల వికాస సంస్థ సూపర్‌వైజర్ లత, మేనేజర్ పబ్బు సులోచన, కో-ఆర్డినేటర్లు సుమలత, సరోజన, జ్యోతి, ఖాజాబీ, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లందకుంట, ఫిబ్రవరి 18: గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. ఆదివారం మండలంలోని రాచపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జమ్మికుంట పట్టణానికి చెందిన సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రణ వ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర ప్రజలం దరికీ మెరుగైన వైద్యం అందించడం కోసం ఆరోగ్యశ్రీని రూ. 5లక్షల నుంచి రూ. 10లక్షలకు పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన దొంతుల రాజేశం, మడిపల్లి సంతోష్, మడిపల్లి కుమార్, మాచర్ల నాగరాజులను ప్రణవ్ అభినందించారు.

బీఎస్పీ నాయకుల సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న బీఎస్పీ నాయకులు

జమ్మికుంట, ఫిబ్రవరి 18: జమ్మికుంట పట్టణంలోని హరిహర థియేటర్‌లో ప్రవీణ్ ఐపిఎస్ సినిమా విడుదల సందర్భంగా హుజూరాబాద్ నియోజక వర్గ బీఎస్పీ అధ్యక్షులు వాసాల రామస్వామి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐపిఎస్, గురుకులాల కార్యదర్శి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా బహుజన వార్గలకు చేస్తున్న సేవలు, కష్టపడుతున్న తత్వాన్ని ప్రవీణ్ ఐపిఎస్ రూపంలో ప్రజల ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సినిమాను అందరు తిలకించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మేడారం బస్సులు ప్రారంభించిన డీఎం



హుజూరాబాద్‌లో మేడారం బస్సులను ప్రారంభిస్తున్న డీఎం శ్రీకాంత్

హుజూరాబాద్, ఫిబ్రవరి 18: హుజూరాబాద్ నుంచి మేడారం జాతరకు వెళ్లేందుకు ఆదివారం డిపో మేనేజర్ సామల శ్రీకాంత్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం వెళ్లేందుకు హుజూరాబాద్ నుంచి పెద్దలకు రూ.310, పిల్లలకు రూ.170 టికెట్ ధర నిర్ణయించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మేడారం జాతరకు వెళ్లేందుకు మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో మురళీ, సమ్మయ్య, వీవీఆర్‌రెడ్డి, సురేఖ, ఎస్ రాణి, జాఫర్‌సింగ్, దేవేందర్‌రెడ్డి, వెంకట్రాజం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఫిబ్రవరి18: నగరంలో విద్యుత్ కొత్త లైన్ పనుల్లో భాగంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నగరంలో వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహం, హనుమాన్‌నగర్, ఉజ్వల పార్క్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అలయెన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్‌గా సత్యనారాయణ



సుభాష్‌నగర్: 137బి అసోసియేషన్ ఆఫ్ అలయెన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవ ర్నర్‌గా కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన పోలు సత్యనారాయణ నియమి తులయ్యారు. అలాగే జిల్లా వైస్ గవర్నర్-1గా డాక్టర్ యెలిగేటి మల్లికార్జున్ నియమింప బడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 14వ దక్షిణ మల్టిపుల్ కన్వెన్షన్ సమావేశంలో ఈమేరకు వారిని నియమించారు. వీరి నియామకం పట్ల కరీంనగర్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్య క్షుడు డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, అలయెన్సు మోర అంజ య్య, డాక్టర్ వేణుకుమార్, వసుల సతీష్, పలువురు అయ్యప్ప గురుస్వాములు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

నేడు హిందూవాహిని ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 18: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని సోమవారం హిందూవాహిని ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా సంయోజక్ ప్రముఖ న్యాయవాది బెజ్జంకి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ దేశంలో ఉన్న యువత అందరికీ ఆదర్శప్రాయుడని, దేశం పట్ల, ధర్మంపట్ల నిబద్ధత ఉండటంలో ఛత్రపతిశివాజీ మహారాజ్ స్ఫూర్తి ప్రధాత అని అన్నారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు బస్టాండ్ వెనుక నుంచి ప్రారంభమై మంచిర్యాల చౌరస్తా, టవర్‌సర్కిల్, కమాన్, తెలంగాణచౌక్, టవర్‌సర్కిల్, కమాన్, ఇందిరాచౌక్ నుండి పద్మనగర్ శివాజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

తిమ్మాపూర్, ఫిబ్రవరి18: మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన మావురపు కొమురయ్య అనే బాధితుడికి ఆరోగ్య అవసరాల నిమిత్తం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ 2లక్షల 50వేల రూపాయల ఎల్‌వోసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోరపల్లి రమణ రెడ్డి, నాయకులు రమేష్ , మోహన్, అశిఖ్ పాషా, సంపత్, అనిల్ పాల్గొన్నారు.

నల్లగొండ దేవస్థానం కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్‌రెడ్డి

చొప్పదండి, ఫిబ్రవరి 18: కొడిమ్యాల మండలం నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం ఉత్సవ కమిటీ సభ్యుడిగా చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవ కమిటీ సభ్యుడిగా ప్రకటించింది. మండలంలో కాట్నపల్లి గ్రామానికి చెందిన ఇప్ప శ్రీనివాస్‌రెడ్డిని దేవస్థానం కమిటీ సభ్యుడిగా నియమించడం పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్త ంచేశారు.

ప్రణవ్‌ను కలిసిన తెలంగాణ ఉద్యమకారుడు

హుజూరాబాద్, ఫిబ్రవరి 18: హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇల్లందకుంట మండలం మల్లన్నపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, న్యాయవాది కనుకుల సంజీవరెడ్డి ఆదివారం నియోజకవర్గ నాయకులు వొడితెల ప్రణవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సంజీవరెడ్డి మొదటి తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా 2001 నుంచి తెలంగాణ ఉద్యమం కోసం బీఆర్ఎస్ పార్టీలో ఉండి కృషి చేశాడు. పార్టీలో ముఖ్యమంత్రి సమక్షంలో సంజీవరెడ్డి చేరేందుకు ప్రణవ్‌ను కలిసినట్లు తెలిసింది.

చలో సెక్రటేరియట్‌కు తరలిరండి

కథలాపూర్, ఫిబ్రవరి 18 : దూపదీప నైవేద్య అర్చకుల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 20న నిర్వహించనున్న చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి తరలిరావాలని దూపదీప అర్చక సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఓరు గంటి మాధవాచార్యులు కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 6500 దేవాలయాల్లో ఇస్తున్న దూపదీప నైవేద్య అర్చ కులకు ఇస్తున్న గౌరవ వేతనం సరిపోవడం లేదని పేర్కొన్నారు. అర్చకులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించడం, కొత్తగా నియమితులైన దూపదీప నైవేద్య అర్చకులకు 7 మాసాల వేతనం విడుదల చేయడం వంటి డిమాండ్ల సాధనకు తరలిరావాలని కోరారు. రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖా మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం అందించనున్నట్టు చెప్పారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

వెల్గటూర్, ఫిబ్రవరి 18: స్తంభంపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆదివారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ నెల 21 నుంచి 26 వరకు శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పాకాల నరేష్ తెలిపారు. బ్రహ్మోత్సవాలకు రావాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమా ర్‌ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాదం దుబ్బ స్వామి, హరి ప్రశాంత్, సప్ప తిరుపతి, యాగండ్ల గంగ య్య, మార్గం సతీష్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఏర్పాటు

కొడిమ్యాల, ఫిబ్రవరి, 18 : సింగపూర్ తెలుగు సమాజం కార్యవర్గ సభ్యుడిగా (ఎస్‌టీఎస్)మండల కేంద్రానికి చెందిన బైరి రవిని సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 23 సంవత్సరాలుగా రవి సంగపూర్‌లో ఉంటు తెలుగు వారి కోసం సహాయ సహకారాలను అందిస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిక కు సహకరించిన టీఎస్‌టీఎస్ అధ్యక్షుడు బొమ్మరెడ్డి, శ్రీని వాసరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఇతర కార్యవర్గ స భ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలి కార్యవర్గం ఏర్పాటు

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 18 : జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ పద్మశాలి సంఘనూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా జోగా గంగాధర్, ఉపాధ్యక్షుడిగా అనుమల్ల నగేష్, కోశాధికారిగా చిప్ప గంగాధర్ నియామకం అయ్యారు.